

సమాజ హిత రీల్స్ చేయండి

ఎస్పీ జగదీష్



అనంతపురం క్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపయోగపడేలా రీల్స్ చేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులు, కథనాలు, స్టేటస్‌లు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డ్రగ్స్ అనర్థాల గురించి ప్రజల్లో చైతన్యం నింపాలని సూచించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సైబర్ నేరగాళ్లు, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న రోడ్డు ప్రమాదాలు, జీవితాలు నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల గురించి ప్రజలను చైతన్యపరచడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ మూడు అంశాలపై పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని, ఇదే సమయంలో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తే బాగుంటుందని అన్నారు. ఈ అంశాన్ని యూట్యూబర్స్ సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ రమణమూర్తి, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ షేక్ జాకీర్, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మరో 700 మెగావాట్ల

సోలార్ పవర్

మంత్రివర్గం ఆమోదం

అనంతపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో మరో 700 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో గురువారం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని గంగవరంలో 400 మెగావాట్ల సామర్థ్యంతో టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తాడిపత్రి శివారులోని బోడాయపల్లిలో 300 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటుకు ఎస్ఏఈఎల్ సోలార్ ఎంహెచ్‌పీ-1 ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే రాయదుర్గం నియోజకవర్గంలో 7500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఆమోదం లభించిన విషయం తెలిసిందే.

సంఘాల ఎన్నిక పూర్తి: జేడీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వంద ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయని పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి గురువారం తెలిపారు. మొత్తం 121 సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చామని, నాలుగు విడతల్లో వంద సంఘాలకు ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. రికార్డులు లేకపోవడం, సభ్యులు హాజరుకాకపోవడం, ఘర్షణలు జరగడంతో 21 సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయని తెలిపారు. వాటికి స్థానిక వెటర్నరీ డాక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తామని తెలిపారు





వ్యవసాయానికి 7 గంటలే విద్యుత్

సీకు చింత..!

- రాత్రి మూడు.. పగలు నాలుగు గంటలు
- జిల్లా వ్యాప్తంగా తొమ్మిది గ్రూప్-సి ఫీడర్లు
- విద్యుత్ సంస్థల నిర్ణయంతో రైతుల్లో గుబులు

విద్యుత్ సంస్థలు తీసుకున్న నిర్ణయాలు అన్నదాతలకు ఇబ్బందికరంగా మారేలా ఉన్నాయి. ఇప్పటికే వ్యవసాయ విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. రబీ పంటలు కీలక దశలో ఉండగా.. సాగునీరు అందించేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. ఇలాంటి సమయంలో అన్నదాతలకు అండగా ఉండాల్సిన విద్యుత్ పంపిణీ సంస్థలు 'రాత్రి కరెంటు' ప్రకటన పేల్చాయి. మూడు గ్రూపులుగా విభజించి, వ్యవసాయ విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించింది. ఈ పద్ధతిని అమలు చేయాలని ఆ శాఖ జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు అందాయి. రైతులకు మేలు చేసేందుకే అని విద్యుత్ శాఖ అంటున్నా, వాస్తవంలో ఎలా ఉంటుందో అన్న ఆందోళన మొదలైంది. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలు, ఓవర్ లోడు ప్రాంతాల్లో రాత్రి వేళల్లో కరెంటు సరఫరా చేస్తామని ఆ శాఖ అధికారులు అంటున్నారు. సంస్థాపరమైన సమస్యలను అధిగమించాలంటే అదనపు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. కానీ రాత్రి కరెంటు సరికాదని రైతులు అంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

గ్రూపు-సిలోని ఫీడర్లు ఇవే..

గ్రూపు-సి ఫీడర్లు జిల్లాలో తొమ్మిది ఉన్నాయి. గుత్తి డివిజన్ ఎస్.కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని సీరజంపల్లి ఫీడర్, కళ్యాణదుర్గం డివిజన్‌లోని మరిమాకులపల్లి, బోడుపల్లి, కనకూరు, ములకలేడు, సూగేపల్లి, ఎనుములదొడ్డి, కురువల్లి, ఉంతకల్లు ఫీడర్లు గ్రూప్-సిలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నీటి లభ్యత, విద్యుత్ పరమైన సమస్యల కారణంగా అధికారులు ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

సి-గ్రూపు వారికి ఏడు గంటలే..



జిల్లా వ్యాప్తంగా 2.02 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. సేద్యానికి 525 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. ఇందులో గ్రూప్-ఎ పరిధిలోకి 146 ఫీడర్లు, గ్రూపు-బిలోకి 370 ఫీడర్లు, గ్రూపు-సిలోకి తొమ్మిది ఫీడర్లను తెచ్చారు. గ్రూపు-ఎ ఫీడర్ల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా జరుగుతోంది. గ్రూప్-బి పరిధిలో రాత్రి 9గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు ఐదు గంటలు, ఉదయం 9:45 గంటల నుంచి మధ్యాహ్నం 1:45 గంటల వరకు నాలుగు గంటలు కలిపి తొమ్మిది గంటలు సరఫరా చేస్తున్నారు. బి-గ్రూపులో వారికి ఐదు గంటలు రాత్రి సమయంలోనే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గ్రూపు-సిలో కూడా ఇదే తరహాలో రాత్రిళ్లు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు మూడు గంటలపాటు, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. సి-గ్రూపులోని వారికి ఏడు గంటలు మాత్రమే విద్యుత్ ఇస్తున్నారు.

రైతులకు ఉపయోగపడాలి..



రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా చేయడం వలన రైతులకు ఇబ్బందిపడతారు. రెండు దఫాలుగా విద్యుత్ సరఫరా కారణంగా నీటి పారకంలో సమస్యలు తలెత్తుతాయి. రైతులు పొలాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది పడతారు. పగటి వేళల్లోనే వ్యవసాయాకి విద్యుత్ సరఫరా చేయాలి. గతంలో ఇదే విధంగా ఉన్నింది. విద్యుత్ సంస్థల నిర్ణయాలు రైతులకు ఉపయోగపడేలా ఉండాలి. రైతులకు అన్నిచోట్లా ఏడు గంటలే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అందరికీ తొమ్మిది గంటలు ఇవ్వాలి.

- మల్లికార్జున, జిల్లా సహాయ కార్యదర్శి, సీపీఐ

రైతుల అభిప్రాయం తీసుకోవాలి..



నీటి లభ్యత తక్కువ ఉన్న ప్రాంతాల్లో రెండు దఫాలుగా కరెంటు సరఫరా చేయాలన్న అభిప్రాయం రైతులలో ఉంది. బోర్లలో నీటి లభ్యత బాగున్నవారు విరామం లేకుండా తొమ్మిది గంటలు కరెంటు వదలాని కోరుతున్నారు. రైతుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని విద్యుత్ సరఫరా చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

పాల కల్తీపై క్లారిటీ..!

ల్యాబ్ నుంచి నివేదిక..?



అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు 'చిక్కటి కల్తీపాలు' తాగింది నిజమేనని స్పష్టత వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రాప్తాడు మండలం బండమీదపల్లిలో 'రామిరెడ్డి కల్తీ పాల డెయిరీ' గుట్టు సోమవారం బయట పడ్డాక, మరుసటి రోజు విజిలెన్స్ అధికారులు నగరంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైతుల నుంచి సేకరించిన పాలలో నీరు కలిపి.. చిక్కదనం కోసం మాల్టోడెక్సిన్, పామాయిల్, ఉప్పు మిశ్రమంతో తయారు చేసిన ద్రావణాన్ని కలుపుతున్నట్లు గుర్తించారు. ఆ పాలను గాయత్రి, విజయ తదితర డెయిరీకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. గాయత్రి డెయిరీలో తనిఖీలు నిర్వహించి, నమూనాలను సేకరించారు. కమలా నగర్‌లో మాల్టోడెక్సిన్ విక్రయిస్తున్న కుమార్ ఎంటర్‌ప్రైజెస్‌ను సీజ్ చేశారు. ల్యాబ్‌కు పంపిన నమూనాలలో కల్తీ నిజమేనని నిర్ధారణ అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బండమీదపల్లి రామిరెడ్డి నుంచి నెలకు 1200 లీటర్ల పాలు గాయత్రి డెయిరీకి వెళుతున్నట్లు గుర్తించారు. ఈ లెక్కన డెయిరీ నుంచి మార్కెట్‌లోకి వెళ్లిన పాలన్నీ కల్తీ అయినట్లు భావిస్తున్నారు. ఈ విషాన్ని జిల్లా ప్రజలు ఎంతకాలంగా తీసుకుంటున్నారో, దాని దుష్ప్రభావం ఏ స్థాయిలో ఉందోనన్న ఆందోళన నెలకొంది. జిల్లాలోని డెయిరీల నుంచి కల్తీపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. దీంతో లక్షలాది మంది ప్రజలు కల్తీపాలను తాగినట్లు స్పష్టమౌతోంది. ఈ కల్తీ రాకెట్‌లో డెయిరీల నిర్వాహకుల పాత్ర గురించీ చర్చ జరుగుతోంది. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



పూల పల్లకిలో స్వామివారు

నేత్ర పర్వం.. ధ్వజారోహణం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా కొండమీదరాయుడి ధ్వజారోహణం గురువారం నేత్రపర్వంగా సాగింది. రెండో రోజు దేవరకొండపై ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభానికి కర్పూర హారతులు పట్టి.. ధ్వజారోహణం చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులను కొండమీద నుంచి పల్లకిలో ఊరేగిస్తూ లక్ష్మీనారాయణస్వామి ఆలయం వద్దకు తోడ్కొనివచ్చారు. సాయంత్రం పూల పల్లకిలో విహరించారు. స్వామివారికి మూడో రోజు శుక్రవారం సింహ వాహన సేవ నిర్వహిస్తారు.

బాలిక.. బంగారం..!



అనగనగా ఓ బాలిక..! అనంతపురంలో ఓ యువకుడితో స్నేహంగా ఉండేది. కలిసి మెలిసి తిరిగేది. గమనించిన తల్లి.. బాలికకు మరో యువకుడితో పెళ్లి చేసింది. కూతురు, అల్లుడి చేత అద్దె ఇంట్లో కాపురం పెట్టించింది. పెళ్లి ఇష్టంలేని బాలిక.. గత నెల పదో తేదీన చెప్పాపెట్టకుండా ఎటో వెళ్లిపోయింది. 'నన్ను వెతకొద్దు..' అంటూ.. ఇన్‌స్టాలో ఓ వీడియో పోస్టు చేసింది. పోతూ పోతూ.. మూడున్నర తులాల బంగారాన్ని తీసుకుపోయింది. అత్తారింటివారు బాలిక తల్లిని నిలదీశారు. ఇష్టంలేని పెళ్లి ఎందుకు చేశారని గొడవకు వచ్చారు. దీంతో బాలిక తల్లి నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన కూతురును వెతికి పట్టుకోవాలని కోరింది. పోలీసులు బాలిక స్నేహితుడిని రెండు మూడు సార్లు పట్టుకుని విచారించారు. తనకు ఆమె గురించి తెలియదని ఆ యువకుడు తేల్చిపోయాడు. బంగారం తీసుకెళ్లిన బాలిక.. సెల్‌ఫోన్‌ను మాత్రం తీసుకుపోలేదు. వేరెవరి ఫోన్ నుంచో వీడియో సందేశాన్ని ఇన్‌స్టాలో పోస్టు చేసింది. దీంతో బాలికను వెతికి పట్టుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. బాలిక తల్లి రోజూ స్టేషన్‌కు వచ్చి గొడవ చేస్తోంది. తన కూతురిని వెతికి పట్టుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తోంది. బాలిక దొరక్కపోయినా, కనీసం బంగారాన్నైనా ఇప్పించండి అని ఆమె కోరుతోందట. కొందరు పెద్ద మనుషులను స్టేషన్‌కు తీసుకువచ్చి మరీ ఒత్తిడి తెస్తుండటంతో పోలీసులు వేటను ముమ్మరం చేశారు.



- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

డ్వామా విజిలెన్స్ అధికారి బదిలీ



అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డ్వామా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి బదిలీ అయ్యారు. వైసీపీ హయాం నుంచి ఐదేళ్లుగా ఆయన డ్వామాలో విజిలెన్స్ ఆఫీసర్‌గా పాతుకుపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బదిలీ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో డీఎల్‌డీఓగా ఉన్న రమణారెడ్డిని కర్నూలు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. డ్వామాలో విజిలెన్స్ అధికారిగా, ఫైనాన్స్ మేనేజర్‌గా రమణారెడ్డి రెండు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ స్థానాలకు ఇంకా ఎవరినీ నియమించలేదు. రమణారెడ్డి ఎప్పుడు రిలీవ్ అవుతారనేది స్పష్టత లేదు.

ఉన్నట్లా.. లేనట్లా..?

ఎండీయూ వాహనాలపై అయోమయం



జిల్లా కేంద్రంలోని రెండో రోడ్డులో షాపువద్ద సంచులు క్యూలో పెట్టి పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

- వాటి ద్వారానే సరఫరా అంటున్న పౌరసరఫరాల శాఖ
- క్షేత్రస్థాయిలో కనిపించని దుస్థితి
- డీలర్ల వద్ద పడిగాపులు కాస్తున్న కార్డుదారులు
- చేతులెత్తేసిన రెవెన్యూ యంత్రాంగం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాలపై సందిగ్ధం నెలకొంది. వాహనాలు ఉన్నట్లా?, లేనట్లా అన్నదానిపై గందరగోళం సాగుతోంది. గత వైసీపీ హయాంలో ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండీయూ వాహనాలను తీసుకొచ్చింది. నిబంధనల మేరకు ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు కేటాయించిన ప్రాంతంలో ఎండీయూ వాహనం వెళ్లి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. వైసీపీ పాలనలో కూడా వాహనాలు ఒకట్రెండు రోజులు తిరిగి ఆ తర్వాత కనిపించకుండా పోతున్నాయనే ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. కూటమి అధికారంలోకి వచ్చాక లబ్ధిదారులకు రేషన్ సరుకుల కష్టాలు తీరుతాయని అందరూ భావించారు. ప్రస్తుతం మరింత అస్తవ్యస్తంగా మారడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు పెరిగాయి. అధికారులు వాహనాల ఊసే ఎత్తట్లేదు.

అస్తవ్యస్తం

జిల్లాలో 1645 సబ్సిడీ సరుకుల దుకాణాలున్నాయి. 6.35 వేల మంది కార్డుదారులున్నారు. పౌరసరఫరాల గోదాముల నుంచి డీలర్ల వద్దకు సరుకులు వెళతాయి. డీలర్ల నుంచి ఎండీయూ వాహనాలు రేషన్, ఇతర సరుకులను లబ్ధిదారుల వద్దకే వెళ్లి పంపిణీ చేయాల్సి ఉంటుంది. అధికారుల లెక్కల మేరకు జిల్లావ్యాప్తంగా 405 ఎండీయూ వాహనాలున్నాయి. వాటి ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. ఎక్కడా అవి కనిపంచట్లేదు. ఒకట్రెండు కనిపించినా మళ్లీ అవి ఎక్కడకు వెళ్తాయో అర్థంకావడం లేదు. దీంతో లబ్ధిదారులు.. షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం డీలర్లు సరుకుల ఇవ్వాల్సి ఉంటుంది. డీలర్లు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు సరుకులు ఇస్తారో కూడా లబ్ధిదారులకు తెలియని పరిస్థితి. దీంతో పనులు వదులుకుని రేషన్ కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని కార్డుదారులు వాపోతున్నారు.

అధికారులు ఎవరికి వారే..

రేషన్ సరుకుల పంపిణీ వ్యవహారం పౌరసరఫరాల శాఖాధికారులు చూసుకుంటారు. వీరు ఏ నెలకు ఎన్ని షాపులకు ఎంతబియ్యం, ఇతర సరుకులు పంపించాలో పరిశీలిస్తారు. మండలస్థాయిలో తహసీల్దార్లు రేషన్ పంపిణీని పర్యవేక్షించాల్సి ఉంటుంది. జిల్లాస్థాయిలో జాయింట్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి (డీఎస్‌ఓ), డీఎంలు చూస్తారు. అధికారులు పట్టించుకోవట్లేదన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పౌరసరఫరాల శాఖాధికారులు మాత్రం రేషన్ సరుకులు ఎండీయూ వాహనాల ద్వారానే పంపిణీ చేయాలని అంటున్నారు. క్షేత్రస్థాయిలో ఎండీయూ వాహనాలు తిరగడంలేదు. అధికారులు సైతం పర్యవేక్షణ మరిచారు. దీంతో డీలర్లదే రాజ్యంగా మారిపోయింది. అందుకే లబ్ధిదారులు రేషన్‌కోసం షాపుల వద్దకు వెళ్లి పడిగాపులు కాస్తూ.. అవస్థలు పడుతున్నారు. జిల్లాకేంద్రలోనే ప్రతినెలా లబ్ధిదారులు రేషన్ తీసుకోవాలంటే నరకం చూస్తున్నారు. ఇక్కడ మరో విచిత్రం ఏమిటంటే ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసినట్లు చూపుతూ ప్రతినెలా ఒక్కో వాహనానికి రూ21వేలు తహసీల్దార్ చెల్లిస్తుండడం శోచనీయం. ఉన్నతాధికారులు మౌనం వహించడం విమర్శలకు తావిస్తోంది.

బీపీ, షుగర్ ఉన్నోళ్లు ఇబ్బంది పడుతున్నారు



గతంలో మాప్రాంతానికి వాహనంలో వచ్చి రేషన్ సరుకులు అందించేవారు. అపుడు అక్కడ తక్కువ జనం ఉండేవారు. సులభంగా సరుకులు తీసుకుపోయేవారం. ప్రస్తుతం వాహనాలు రావడంలేదు. దీంతో డీలర్ల వద్దకు వచ్చి పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీర్ఘకాలిక వ్యాధి పీడితులు ఇబ్బంది పడుతున్నారు.

- లక్ష్మి, అనంతపురం

షాపుల వద్ద పడిగాపులు కాస్తున్నాం



రేషన్ సరుకుల సరఫరా గందరగోళంగా ఉంది. ప్రతి నెలా షాపు వద్దకు వచ్చి కాచుకుకూర్చుంటున్నాం. తెల్లవారుజామునే వచ్చి సంచులు క్యూలో పెట్టి, కాచుకు కూర్చుంటున్నాం. పనులకు కూడా వెళ్లలేక పోతున్నాం. ఫలితంగా పనిచేసే చోట చీవాట్లు పడాల్సి వస్తోంది. -కల్పన, అనంతపురం

ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ ఇవ్వాలి



రేషన్ బియ్యం ఇతరత్రా సరుకులను ఎండీయూ వాహనాల ద్వారానే పంపిణీ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రస్తుతానికి ఎలాంటి మార్పులు చేయకుండా పాత విధానంలోనే అమలుకు ఆదేశాలిచ్చింది. డీలర్ల వద్దకు లబ్ధిదారులు వెళ్లకూడదు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు పర్యవేక్షించాలి. వాహనాలు తిరగకపోవడంపై విచారించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సరుకులు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. -వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ

ఛీత్కారం నుంచి.. సత్కారం దాకా.. 6 కూటమి ప్రభుత్వమైనా కరుణించేనా? 7

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు



మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీలు శుక్రవారం నుంచి 9వతేదీ వరకు నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్(మా) అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల నుంచి 100 సంవత్సరాల వయసు వరకు మాస్టర్స్ అథ్లెటిక్ పరుగు పోటీలకు అర్హులని తెలిపారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలు, పేర్ల నమోదుకు సెల్ నంబరు 9502539888ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మా జిల్లా ప్రధాన కార్యదర్శి సికిందర్, కార్యదర్శి లోకనాథ్, సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, బాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో స్వామి వారి 286వ జయంతి ఉత్సవాలపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే జయంతి ఉత్సవాలకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరాఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు ఓబులేసు, రమాదేవి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్‌డీ శివాజీరెడ్డి, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్, పీఆర్ డీఈ మురళీధర్, ట్రస్టు సభ్యులు వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రూ.50 లక్షల మంజూరు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని ఏపీ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ హయాంలో ఉత్సవాలకు ఒక్క పైసా నిధులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులున్నా రూ.50 లక్షలు మంజూరు చేయడంపై సంతోకరమన్నారు. కార్యక్రమంలో రాజేష్ నాయక్, మనోహర్, శ్రీనివాస్ నాయక్, సురేష్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



ఛీత్కారం నుంచి.. సత్కారం దాకా..



లోను ఇచ్చేది లేదన్నారు

ఒకప్పుడు బ్యాంకు అధికారులు లోను ఇచ్చేది లేదంటూ ఖరాఖండిగా తేల్చిచెప్పారు. కాని ఇప్పుడు బ్యాంకు అధికారులే రుణం ఇస్తామని మా కాలనీ వైపు వస్తున్నారు. ఇదంతా మా సమష్టి కృషితోనే సాధ్య పడింది.

- గీతమ్మ, భీముడు మహిళా సంఘం సభ్యురాలు



సంఘాల్లో ఉన్న పొదుపు డబ్బుపై చర్చిస్తున్న మహిళలు

నాడు పైసా కోసం అడుక్కున్న మహిళలు.. నేడు సంఘాల్లో రూ.లక్షల్లో పొదుపు

- చిరు వ్యాపారాలు, కూలి పనులతో స్వావలంబన
- కాయకష్టంతో పిల్లల భవిష్యత్తుకు బాటలు
- ఆర్డీటీ సహకారంతో పక్కా గృహాల నిర్మాణం
- ఛీదరించుకున్నవారే ఆశ్చర్యపడేలా అభివృద్ధి

స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీరామ జోగుల కాలనీ మహిళలు

ఒకప్పుడు రూపాయి కోసం భిక్షమెత్తారు. పొట్ట చేతపట్టుకుని, ఊరూరూ తిరుగుతూ, ఎక్కడబడితే అక్కడే గుడారాలు వేసుకొని జీవన పోరాటం చేశారు. తమ పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వచ్చిన భిక్షమెత్తడాన్నే జీవన విధానంగా మార్చుకున్నారు. అయితే సమాజంలో మిగతా వారితో పాటు సమానంగా, గౌరవంగా బతకాలనే ఆలోచన వారి రాతను మార్చింది. రూపాయి అడిగితే ఛీకొట్టిన వారు సైతం ఆ మహిళల విజయాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నాయి. పొదుపు సంఘాల ద్వారా జీవన గమనంలో సాధికారత సాధిస్తున్న వారే కంబదూరులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న శ్రీరామ జోగుల కాలనీకి చెందిన మహిళలు. అడుక్కుతినే రోజుల నుంచి స్వయం ఉపాధి పొందుతున్న పరిస్థితుల దాకా వారి విజయయాత్ర ఇలా...

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం ఊరూరు తిరుగుతున్న సంచార జాతికి చెందిన కొందరు కంబదూరు శివారులో కొన్నేళ్ల కిందట గుడారాలు వేసుకున్నారు. ప్రతిరోజు ఉదయం పిల్లా పాపలతో కలిసి ఇల్లిల్లూ తిరుగుతూ భిక్షమెత్తేవారు. దొరికిన ఆహారంతో కడుపునింపుకునేవారు. ఈక్రమంలో ఎందరి నుంచో ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. తరచూ ఎదురవుతున్న అవమానాలు వారిలో సొంతంగా బతకాలనే ఆలోచనను తట్టి లేపాయి. ప్రభుత్వ సహకారంతో వెలుగు సంఘాలు, ఆర్డీటీ సంఘాలను ఏర్పాటు చేసుకొని అందులో పొదుపు చేసుకుంటూ, రుణాలు పొందుతూ చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. స్వయంకృషితో ఎదుగుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలనీలో సుమారు 550 మంది జనాభా ఉన్నారు. ఇందులో సుమారు 120 మంది దాకా మహిళలు ఉంటారు. 2007 లో భిక్షమెత్తుకుంటూ కంబదూరుకు వచ్చి శివారులో స్థిరపడ్డారు. ఆ ప్రాంతాన్ని ఒక కాలనీగా మార్చేసుకున్నారు. ఇక్కడ సుమారు 10 మహిళా సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 12 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి బ్యాంకులు సుమారు రూ. 50 లక్షల దాకా రుణం ఇచ్చాయి.



శ్రీరామ జోగుల కాలనీ

సొంత వ్యాపారాలతో...

బ్యాంకుల ద్వారా పొందిన రుణాలతో ఆ మహిళలు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. సబ్బులు, సర్ఫ్, ఫినాయిల్, బిందెలు, పేస్టులు, బ్రష్‌లు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. అలా వచ్చిన సంపాదనతో కొంత మొత్తం పొదుపు చేస్తూ రుణాలు తిరిగి చెల్లిస్తున్నారు. ఆదాయం పెరగడంతో పిల్లలను చదివించడం ప్రారంభించా రు. ఇలా వీరి సంతానంలో ఇప్పుడు ఐదో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న పిల్లలు కూడా ఉన్నారు. అలాగే సుమారు 30 నుంచి 40 మంది దాకా అమ్మాయిలకు పెళ్లిళ్లు కూడా చేశారు.

గుర్తింపు అడిగితే ఛీత్కారం

నిత్యం ఎక్కడో ఒకచోటకు వలస వెళ్తుంటారని, ఇలాంటి బిక్షగాళ్లకు బియ్యం కార్డులు కాని, ఎటువంటి గుర్తింపు కార్డులు కాని ఇచ్చేది లేదంటూ అప్పట్లో రెవెన్యూ అధికారులు వారిని ఛీ కొట్టారు. చివరికీ మహిళలంతా కలిసి 10 రోజుల పాటు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇక్కడే బతుక్కుంటామని, ఆసరా ఇవ్వాలని వేడుకున్నారు. మహిళల ఆందోళనకు అధికారులు దిగి వచ్చి, బియ్యం కార్డులను పంపిణీ చేశారు. ఈక్రమంలోనే వారు నలుగురితో పాటు సమాజంలో గౌరవంగా బతకాలనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగారు.

రూ.50తో పొదుపు ప్రారంభం

కంబదూరుకు వచ్చిన తర్వాత సంచార జాతి మహిళలంతా మాట్లాడుకుని వెలుగు, ఆర్డీటీ సంస్థల ద్వారా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. తమ సంఘాలకు రాముడు, సీతమ్మ, భీముడు, ఆంజనేయస్వామి, కృష్ణుడు, సంతోష్, వేదావతి, దివ్యశ్రీ, లక్ష్మీ, భానుమతి పేర్లను పెట్టుకున్నారు. ఒక్కో మహిళ రూ.50తో పొదుపును ప్రారంభించారు. ఇలా కొన్నేళ్ల పాటు పొదుపు చేయగా అది నేటికి రూ. 10 లక్షల దాకా చేరింది. పొదుపు ద్వారా అధికారుల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. వెలుగు కార్యాలయంలో 10 మహిళా సంఘాలు, ఆర్డీటీ సంస్థలో 5 మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. మరో మూడు కొత్త సంఘాలను ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆ మహిళలు వెల్లడించారు.

సేద్యం పనులకు డిమాండ్

ఈ మహిళల్లో కొందరు చిరు వ్యాపారాలు చేసుకుంటుండగా, మరి కొందరు వ్యవసాయ కూలిపనులకు వెళ్తున్నారు. కష్టపడి పని చేస్తుండటంతో వీరికి డిమాండ్ బాగా పెరిగింది. 70 మంది మహిళలు ఓ గ్రూప్‌గా మారారు. వీరిలో మళ్లీ బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా విడిపోయారు. వీరందరికి ఒక గ్రూప్ లీడర్‌గా ఉంటారు. ఎక్కడికి ఏ పనికి వెళ్లాలన్నా అనుమతులు తీసుకునే వెళ్తుంటారు. ఇంతమంది మహిళలు ఒకే చోట పనికి వస్తుండటంతో కూలి పనులకు తీసుకెళ్లడానికి రైతులు ఈ కాలనీ వైపు పరుగులు తీస్తుంటారు. కంబదూరు మండలంలో పాటు కర్ణాటక ప్రాంతాల్లో ఉండే గ్రామాలకు కూడా వీరు కూలి పనులకు వెళ్తుంటారు. ఖాళీ సమయం అనేదే ఈ మహిళలకు ఉండదు. నిత్యం ఎక్కడో ఒక చోటకు కూలి పనులకు వెళ్తుంటారు. అలాగే ఉపాధి హామీ పనులకు కూడా వెళ్తుంటారు.

ఆదుకున్న ఆర్డీటీ

సొంతిళ్లు లేని మహిళలందరూ కలిసి ఆర్డీటీ ప్రతినిధులకు సమస్యను విన్నవించారు. స్పందించిన ఆర్డీటీ వారికి ఒకే సారి 35 పక్కా గృహాలను నిర్మించింది. దీంతో గుడిసెలతో ఉన్న ఆ ప్రాంతం అందమైన కాలనీగా రూపుదిద్దుకుంది. దానికి శ్రీరామ జోగుల కాలనీగా పేరు పెట్టుకున్నారు. కొండ ప్రాంతంలో ఈ కాలనీ ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఇక్కడ ప్రభుత్వ నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించింది. వైద్య సిబ్బంది అక్కడికే వెళ్లి వైద్య సేవలపై అవగాహన కల్పిస్తుంటారు. ఇదంతా తమ ఇంటి మహిళల వల్లే సాధ్యమైందని పలువురు పురుషులు పేర్కొన్నారు.

రూపాయి కోసం భిక్షమెత్తాం



ఒకప్పుడు రూపాయి కోసం భిక్షమెత్తాం. తరచూ ఎదురైన ఛీత్కారాలతో ఆ రూపాయినే పొదుపుగా మార్చుకుని, కష్టపడి పని చేసుకుంటూ నలుగురిలో గౌరవంగా బతుకుతున్నాం. భిక్షమెత్తిన రోజుల్లో తిండికి అల్లాడిన మేము మా సంపాదనతో ఇప్పుడు ఇంటిల్లిపాది మూడు పూటల్లా తింటున్నాం. ఇదంతా మా సమష్టి కృషే. అధికారులు చేయూతనిస్తే ఇంకా ఆర్థికంగా ఎదుగుతాం.

- జయమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు

డబ్బుంటేనే గుర్తింపు



నేడు సమాజంలో డబ్బుంటేనే గౌరవం, గుర్తింపు. అందుకే ఆదర్శంగా అందరిలోను నిలవాలనే ఆలోచనతో ముందడుగు వేశాం. పైసా పైసా పొదుపు చేసి దాన్ని లక్షలుగా మార్చి మా బతుకులను మార్చుకున్నాం. ఇంకా ఆదర్శంగా నిలవాలన్నదే మా ప్రయత్నం. ఇదంతా మహిళలందరూ రాత్రింబవళ్లు కష్టపడిన విజయం. ఇదే స్ఫూర్తితో ముందుడుగు వేస్తాం. ప్రతి నెలా పొదుపు సూత్రాలు పాటిస్తున్నాం.

-శ్రీదేవి, భీముడు మహిళా సంఘం సభ్యురాలు

భిక్షమడిగితే విసుక్కునేవారు



భిక్షం అడిగితే అందరూ మమ్మల్ని విసుక్కునేవారు. అందుకే అడుక్కోవడాన్ని వదిలేశాం. స్వశక్తితో మేము ఓ కాలనీని ఏర్పాటు చేసుకుని, డబ్బులు సంపాదిస్తూ గౌరవ మర్యాదలు పొందుతున్నాం. సుమారు 70 మందికి పైబడి మా కాలనీలో మహిళలు జీవిస్తున్నారు. మహిళలందరికీ స్వయం ఉపాధి పథకాన్ని ఇక్కడే ఏర్పాటు చేస్తే ఆర్థికంగా ఇంకా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

- గంగమ్మ, సీతమ్మ మహిళా సంఘం సభ్యురాలు

రాత్రింబవళ్లు కష్టపడ్డాం



డబ్బు, పేరును సంపాదించడం కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డాం. ఆర్డీటీ, ప్రభుత్వ అధికారులు అందరూ కూడా మా కాలనీని ఆదర్శంగా తీసుకోవాలని సమావేశాల్లో చెబుతుండటం మాకు గర్వం కలిగిస్తోంది. అధికారులు మేము కష్టపడుతూ సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికి చెబుతుంటారు. ఇప్పుడు ఎక్కడ చూసినా మా కాలనీ గురించి చర్చించుకోవడం ఆనందం కలిగిస్తోంది.

- రామక్క, రాముడు మహిళా సంఘం

పంట నమోదును పూర్తి చేయండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రబీ ఈ పంట నమోదు, ఈకేవైసీలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం ఏడీఏలు, ఏఓలతో సమావేశాన్ని నిర్వహించారు. కిసాన్ డ్రోన్‌లకు సంబంధించి కొత్త గ్రూపులను, పైలెట్లను గుర్తించడంతోపాటు శిక్షణ ఇవ్వాలన్నారు. మరో రెండు రోజుల్లో ప్రతి మండలానికి ఒక కిసాన్ డ్రోన్ రైతు గ్రూపును గుర్తించి, వారి వివరాలు పంపాలని ఆదేశించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించి, లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు పరిశీలించి, త్వరగా ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు రవి, వెంకటరాముడు, యల్లప్ప, లక్ష్మానాయక్, టెక్నికల్ ఏఓలు వెంకటేకుమార్, రాకేష్, బాలూ నాయక్ పాల్గొన్నారు.

కోళ్ల మరణాలపై సమాచారం ఇవ్వండి

పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కోళ్లు అసాధారణంగా మరణిస్తే స్థానిక వెటర్నరీ డాక్టర్లకు వెంటనే సమాచారం అందించాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్ల అసాధారణ మరణాలు సంభవించాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా అధికారులను అప్రమత్తం చేసిందన్నారు. క్షేత్ర స్థాయిలో కోళ్ల పరిస్థితిపై పరిశీలించామని, ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అసాధారణ మరణాలు లేవన్నారు. అవసరమైన చోట్ల నమూనాలు సేకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా కోళ్లు చనిపోతే గుంత తీసి పూడ్చాలన్నారు.

15న మెగా జాబ్‌మేళా : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 15న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని మధుగిరి రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణంలో ఫిబ్రవరి 15 ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

విడపనకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పాల్తూరు ఎస్‌ఐ మురహరి తెలిపిన వివరాల మేరకు.. విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(28) బుధవారం రాత్రి క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన బంధువులు వెంటనే బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వన్నూరుస్వామికి మూడు ఎకరాలు సొంత పొలం ఉంది. దాంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు చేసేవాడు. పంటల పెట్టుబడుల కోసం సుమారు రూ. 9లక్షలకు పైగా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చుకోవాలని మదన పడుతుండేవాడని బంధువులు తెలిపారు. ఆ బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతుడికి భార్య సునిత, కొడుకు, కూతురు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుంతకల్లు మీదుగా రైళ్ల మళ్లింపు

గుంతకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా నాలుగు రైళ్లను గుంతకల్లు మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12642) రైలును ఈ నెల 10, 15, 17 తేదీల్లో విజయవాడ-గూడూరు సెక్షన్ ద్వారా కాకుండా బాలార్షా, ఖాజీపేట్, కాచిగూడ, డోన్, గుంతకల్లు, రేణిగుంట, చెన్నై మీదుగా మళ్లిస్తామని తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12644) రైలును ఈనెల 14న, హజ్రత్ నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12646) రైలును ఈనెల 11, 18 తేదీల్లోనూ, ఇండోర్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 22645) రైలును ఈనెల 10, 17 తేదీల్లోనూ బాలార్షా, ఖాజీపేట్, కాచిగూడ, డోన్, గుంతకల్లు, రేణిగుంట, చెన్నై మార్గంలో మళ్లిస్తామని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా షోలాపూర్-తిరుపతి (వయా గుంతకల్లు) వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 01437)ను ఈ గురువారం (6న) విజయపుర-గదగ్-హోస్పేట-బళ్లారి-గుంతకల్లు మీదుగా మళ్లించారు. ఔరంగాబాద్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నంబర్ 17621)ను 7వ తేదీ తాండూరు-ఆదోని మీదుగా కాకుండా వికారాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, డోన్, గుంతకల్లు మీదుగా మళ్లిస్తున్నామని తెలియజేశారు. గుంతకల్లు మీదుగా వెళ్లే కన్యాకుమారి-పూనే ఎక్స్‌ప్రెస్‌ను (నంబర్ 16382) ఈ నెల 6, 7, 8 తేదీలలో గంటన్నర ఆలస్యంగా నడుపుతున్నామని తెలిపారు.

పండ్లతోటల రైతులను ఆదుకోండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నల్లప్పతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉద్యానవన కాంక్లేవ్ ఈ ప్రాంత ఉద్యానవన ఉత్పత్తుల ప్రచారానికి తోడ్పడాన్ని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. పండ్లతోటల రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు కంపెనీల ఒప్పందాలే పరిష్కారమన్నట్లు భావించడం తగదన్నారు. పండ్లతోటల రైతులతో విస్తృతంగా చర్చించి, వారిని ఆదుకోవడానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గత 15 సంవత్సరాల్లో వచ్చిన వరుస కరువుల వల్ల మెట్ట వ్యవసాయం తీవ్ర సంక్షోభానికి గురైందని తెలిపారు. సాగునీటి వనరుల అభివృద్ధికి తక్షణ ప్రత్యామ్నాయంగా మైక్రో ఇరిగేషన్ విధానం అమలులోకి వచ్చిందన్నారు. హార్టికల్చర్ కాంక్లేవ్ ద్వారా పండ్లతోటల రైతులను సమగ్రంగా ఆదుకోవడానికి బదులుగా కంపెనీలు, ఒప్పందాల చుట్టూ తిప్పారని అన్నారు. కార్యక్రమం ప్రచారానికే తప్ప రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యాన రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

9న గిరిజన సమస్యలపై సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 9న ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10గంటలకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన గిరిజన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 6 నుంచి 12 శాతానికి పెంచాలని, మైదాన ప్రాంత గిరిజనులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు.

చీనీని పీడిస్తున్న పొలుసు

పురుగు దెబ్బకు రైతు కుదేలు.. కళ్ల ముందే ఎండుతున్న చీనీచెట్లు

ఖరీదైన మందులు వాడినా ఫలితం శూన్యం



వ్యాధిసోకిన చీనీ తోట

తాడిమర్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సులువుగా పండించే పంట ప్రస్తుతం కష్టతరమైపోయింది. రెండు సార్లు పురుగుల మందులు స్ప్రే చేస్తే చేతికి వచ్చే చీనీ పంట.. నేడు 16 సార్లు మందులు కొట్టినా తెగులు అదుపులోకి రాలేదు. దీనికి తోడు ఇటీవల వచ్చిన పొలుసు పురుగు (హైరోకోకస్ సిట్రస్) తెగులు తీవ్రం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలుసు పురుగు అధికమై చీనీ చెట్ల బెరడు దెబ్బతిని ఎండిపోతున్నాయి. చీనీ కాయలకు మంగు ఏర్పడడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం జిల్లాలో గార్లదిన్నె మండలం, సత్యసాయి జిల్లాలో తాడిమర్రి మండలంలో అధికంగా చీనీ సాగవుతోంది. తెగుళ్లను అధికారులు కనీసం పరిశీలించిన పాపాన పోలేదు. పొలుసు పురుగు నివారణకు లీటరు రూ. 5వేల నుంచి 8వేల వరకు వెచ్చించి పిచికారి చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఈ తెగులు తీవ్రత మండలంలోని శివంపల్లి, తాడిమర్రి, కునుకుంట్ల గ్రామాల్లో అధికంగా ఉంది.

ఇలా మొదలవుతుంది..

పొలుసు తెగులుతో మొదటి దశలో చెట్లకు ఉన్న ఆకులు పసుపు వర్ణానికి మారడం మొదలవుతుంది. తరువాత కాండంపై ఉన్న బెరడు పగిలిపోవడం, చెట్టు నుంచి విపరీతంగా పూత, పిందె రావడంతోపాటు కాండంపై తెల్లటి పురుగు కనిపిస్తుంది. ఆ తరువాత దశలో చెట్టు పూర్తిగా ఎండిపోతుంది. దీనిని అదుపు చేయడానికి రైతులు మొదట కాండాన్ని గోనె సంచితో శుభ్రం చేసిన తరువాత మైలుతుత్తం, సున్నం కలిపి తయారు చేసుకున్న బోర్డో మిశ్రమాన్ని చెట్టు కొమ్మల వరకు పట్టిస్తున్నారు. ఇలా కూడా అదుపులోకి రానప్పుడు ఖరీదైన మందుల వైపు రైతులు పరుగులు పెడుతున్నారు. వయసు ఎక్కువగా ఉన్న చెట్లకే కాకుండా ఇటీవల నాటుకున్న వాటికి కూడా వ్యాప్తి చెందుతుండటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు విలవిల లాడుతున్నారు. ఒక చెట్టు చనిపోయిందంటే.. ఏడాదికి సుమారు రూ.5వేలు నష్టం వాటిల్లినట్టే. ఇలా ఒక్కో రైతు పొలంలో కనీసం 40 నుంచి 50 చెట్లు చనిపోయాయి. కునుకుంట్లలో మరీ దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక పరిస్థితి సరిగా లేని రైతులు ఈ తెగులుకు మందులు కొనుగోలు చేయలేక బెంబేలెత్తిపోతున్నారు. ఆర్గానిక్ మందులను కూడా తెప్పించుకుని రెండు, మూడు రోజుల పాటు బెల్లంనీటిలో కలిపి చీనీచెట్లకు వదులుతున్నారు. దీనికి తోడు నల్లి ఉధృతి కూడా పెరుగుతోంది. పొలుసుపురుగుకు మందు కొట్టాలో.. నల్లికి కొట్టాలో తెలియక రైతులు గందరగోళంలో పడ్డారు.



చివరి దశ.. కాయలకు సోకిన మంగు

ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు



రోజుకొక మందుల కంపెనీ వాళ్లు వస్తారు.. ఆ మందు కొట్టు, ఈ మిశ్రమం పట్టించు, చెట్టు చుట్టూ గాడి తీసి అందులో మందు, నీరు పోయి అని చెబుతున్నారు. ఇవన్నీ కాదని ఆర్గానిక్ మందులు వాడితే మంచి ఫలితం వస్తుందని మరొకరు చెబుతారు. అన్నీ చేసినా చెట్టు పూర్తిస్థాయిలో కోలుకోలేదు. ఇప్పటికి రూ.1.50 లక్షలు అప్పులు చేసి మందులు కొట్టాను. అయినా ఫలితం లేదు.

-చలపతి, రైతు, తాడిమర్రి

అధికారులు దృష్టి సారించాలి



అందరూ వచ్చి పోతున్నారే కానీ అధికారులు మాత్రం రావడంలేదు. వారు తోటలను పరిశీలించి తగిన మందులను సిఫారసు చేస్తే బాగుంటుంది. ప్రభుత్వం కూడా మా పరిస్థితిని అర్థం చేసుకుని తక్కువ ధరలో మందులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఆర్గానిక్ మందులు కూడా వదిలాం. అయినా ఫలితం కనిపించలేదు.

-ప్రభాకర్, రైతు, తాడిమర్రి

బడిలో బోగస్ లెక్కలు..!

- కనిపించని 2,685 మంది విద్యార్థులు
- కమిషనర్ ఆదేశాలతో విచారణ
- జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లో ఏరివేత



డీఈఓ కార్యాలయం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఒకరు, ఇద్దరు కాదు.. వేలాది మంది విద్యార్థులను బడిలో బోగస్‌గా నమోదు చేసినట్లు అధికారులు తేల్చారు. జిల్లావ్యాప్తంగా 2,685 మంది విద్యార్థులు లేకున్నా.. బోగస్‌గా ఎన్‌రోల్ చేసినట్లు గుర్తించారు. 31 మండలాల్లో జల్లెడ పట్టి పిల్లల లెక్క తేల్చారు. డ్రాపౌట్లు, లాంగ్ ఆబ్సెంట్స్ ఇతర కారణాల వల్ల 1648 స్కూళ్లలోలేని పిల్లలను గుర్తించారు. బోగస్ ఎన్‌రోల్‌మెంట్ పిల్లల ఏరివేత ప్రక్రియ ప్రారంభానికి ముందు 1,73,309 మంది విద్యార్థులు ఉండేవారు. ఏరివేత తర్వాత ఆ సంఖ్య 1,70,624కి చేరింది. దీంతో జిల్లాలో 2,685 మంది రికార్డులో ఉన్నా... స్కూళ్లలో కనిపించడం లేదు. దీంతో బోగస్ పిల్లలుగా గుర్తించి, ఆన్‌లైన్‌లో సైతం వారి వివరాలు తొలగించినట్లు తెలుస్తోంది.

కమిషనర్ ఆదేశాలతో..

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చారు. ఉమ్మడి జిల్లాల అధికారులతో ఆయన జీవో 117పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ.. స్కూళ్లలో బోగస్ రోల్‌ను ప్రస్తావించారు. ఆన్‌లైన్‌లో ఉన్నదానికి, భౌతికంగా స్కూళ్లలో ఉన్న సంఖ్యకు చాలా తేడా కనిపిస్తోందని, దీనిపై కలెక్టర్లు సైతం విచారణ చేయించాలని ఆదేశించారు. దీంతో ఎంఈఓలు.. ఎంపీడీఓలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో కలిసి స్కూళ్లలోని లెక్కలు తేల్చాలంటూ ఆదేశించారు. ఇతర శాఖల అధికారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ఎంఈఓల స్థాయిలో ఏరివేతకు దిగారు. అలా ఎట్టకేలకు మండలాల వారీగా పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌పై ఎంఈఓలు విచారణ చేపట్టారు. మండలాల నుంచి దీర్ఘకాలంగా స్కూళ్లకు గైర్హాజరవుతున్న విద్యార్థులు, డ్రాపౌట్లు, ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు తీసుకుని ప్రైవేటు స్కూళ్లు, అకాడమీల్లో చదువుతున్న పిల్లల లెక్కలు తీశారు.

బోగస్ ఎన్‌రోల్‌మెంట్ వివరాలివీ..

మండలం	బోగస్ విద్యార్థుల సంఖ్య
అనంతపురం	449
ఆత్మకూరు	73
బెళుగుప్ప	80
బొమ్మనహాళ్	340
బ్రహ్మసముద్రం	37
బుక్కరాయసముద్రం	166
డి హీరేహాళ్	80
గార్లదిన్నె	15
గుత్తి	80
గుమ్మఘట్ట	108
గుంతకల్లు	286
కళ్యాణదుర్గం	79
కంబదూరు	74
కణేకల్లు	110
కూడేరు	77
కుందుర్పి	9
నార్పల	56
పామిడి	52
పెద్దపప్పూరు	14
పెద్దవడుగూరు	31
పుట్లూరు	20
రాప్తాడు	37
రాయదుర్గం	74
శెట్టూరు	35
శింగనమల	17
తాడిపత్రి	46
ఉరవకొండ	35
వజ్రకరూరు	35
విడపనకల్లు	124
యాడికి	37
మొత్తం	2,685

ఆకు రాలిన చోట..



శిశిర సమీరమో..
జలధి సాన్నిధ్యమో..
ఆకులు రాలి..
మోడువారిన నీ..
కొమ్మ రెమ్మలపై
విహంగాలు పూలై
కాశాయి చూశావా..?
రాలిపోయాయని..
విచారించకు..!
విరబూశాయని
విశ్వసించకు..!
ఏదీ శాశ్వతం కాదు..
అనుభవం ఏదైనా..
స్వీకరించు..!
ఇక్కడ అంతే..!
ప్రకృతి వింతే..!
(కూడేరు మండలం శివరాంపేట ఏటి గంగమ్మ వద్ద)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలకు గీత కులస్తులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 5వతేదీతో ముగిసింది. ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువును ప్రభుత్వం పొడిగించిందని సూపరింటెండెంట్ తెలిపారు. 10వ తేదీన జడ్పీ ఆడిటోరియంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం దుకాణాలను గీత కులస్తులకు కేటాయించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గుట్టకిందపల్లి వద్దగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేశ్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. 3 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలతో ఉదయం 9గంటలకు కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కూటమి ప్రభుత్వమైనా కరుణించేనా?

ఎంపీఈఓలకు రెన్యువల్ కష్టాలు తీరేనా..?

- ఏటా ఏప్రిల్‌లో జీవో ఇవ్వాలి
- వైసీపీ హయాంలో ప్రతిసారీ ఆలస్యంగా జారీ
- ఈసారైనా సకాలంలో ఇచ్చేరా?
- మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్


ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీఈఓల నేతలు (ఫైల్)

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓ (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లకు రెన్యువల్ కష్టాలు ఇప్పటికైనా తీరుతాయో.. లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి నెలాఖరుదాకా రెన్యువల్ జీవో జారీ చేయాల్సి ఉంది. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో ఏటా నాలుగు నెలలు ఆలస్యంగా ఎంపీఈఓల రెన్యూవల్ జీవోను ఇస్తూ వచ్చారు. దీంతో ఐదు నెలలు ఆలస్యంగా వేతనాలు అందేవి. ఈ పరిస్థితుల్లో బయట వ్యక్తుల వద్ద అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. ఈసారైనా రెన్యువల్ జీవో సకాలంలో ఇస్తారో..? లేదోనంటూ ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో ఇచ్చేరా..?

ఉమ్మడి అనంత జిల్లాలో ప్రస్తుతం 355 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. గత టీడీపీ హయాంలో 2015లో ఎంపీఈఓలను కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగంలోకి తీసుకున్నారు. అప్పట్లో ఏటా సకాలంలో రెన్యువల్ జీవోను జారీ చేసేవారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు అప్పట్లో సకాలంలో నేరుగా ప్రభుత్వానికి ఎంపీఈఓల రెన్యువల్ ఫైల్ పెట్టి, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పంపేవారు. గత వైసీపీ పాలనలో ఏటా నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో ఇస్తూ వచ్చారు. దీంతో ప్రతిసారీ ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. ఫలితంగా ఎంపీఈఓలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఉమ్మడి జిల్లాలోని పలు డివిజన్లలో అదే నెలలో వేతనాల బిల్లులు పెడుతుండగా.. కొన్నిచోట్ల మాత్రం రెండు నుంచి మూడు నెలలు ఆలస్యం చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో రెండు మాసాల సమయమే ఉంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలోనైనా రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు మార్చి నెలాఖరులోగా రెన్యువల్ జీవోను జారీ చేస్తారో.. లేదోనని ఎంపీఈఓలు ఆందోళన చెందుతున్నారు.

వైసీపీ సర్కారు నిర్ణయాలతో ఇక్కట్లు

గత టీడీపీ హయాంలో 2015లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరఫున గ్రామస్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏ పోస్టులకు ఎంపికయ్యారు. మిగిలిన వారిలో 253 మంది ఎంపీఈఓలను 2021, 2022 సంవత్సరాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ఇందులో సగం మంది అక్కడికి వెళ్లలేక ఉద్యోగం మానేశారు. ఎంపీఈఓల సంఘం నాయకులు.. కూటమి ప్రజాప్రతినిధులను కలిసి, పలుమార్లు విన్నవించడంతో ఎట్టకేలకు ఇటీవల తిరిగి చిత్తూరు నుంచి ఉమ్మడి అనంత జిల్లాకు పంపారు. ఉమ్మడి జిల్లాలోని కొందరు అధికారులు తమను చులకనగా చూస్తున్నారంటూ ఎంపీఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనరేట్‌లోని కొందరు ఉన్నతాధికారులు తమ సమస్యలు వినేందుకు ఇష్టపడటం లేదని వాపోతున్నారు.

సమాన పనికి... సమాన వేతనం..

అనంతపురం జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 126 మంది గ్రామ వ్యవసాయ, 175 మంది ఉద్యాన, 18 మంది పట్టుపరిశ్రమ సహాయకులు పనిచేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 127 మంది గ్రామ వ్యవసాయ, 156 మంది ఉద్యాన, 110 మంది పట్టుపరిశ్రమ శాఖ సహాయకులుగా కొనసాగుతున్నారు. అనంతపురం జిల్లాలో 193 మంది ఎంపీఈఓలు, శ్రీసత్యసాయి జిల్లాలో 162 విధులు నిర్వర్తిస్తున్నారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది చేసే పనులే ఎంపీఈఓలు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ-పంట నమోదు, రైతులతో ఈకేవైసీ, సబ్సిడీ విత్తన పంపిణీ, పంటల బీమా, పంటనష్టపరిహారం జాబితా తయారీ, మట్టి నమూనాలు, పొలం పిలుస్తోంది కార్యక్రమాల నిర్వహణ, రైతు భరోసా, పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్, ఈకేవైసీ, రైతులకు డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్, పంట ఉత్పత్తుల కొనుగోలు రిజిస్ట్రేషన్, పంటకోత ప్రయోగాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ తదితర పనులు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమానంగా పనులు చేస్తున్నా.. ఎంపీఈఓలకు తక్కువ వేతనం ఇస్తుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం సిబ్బందికి నెలకు రూ.34 వేల వేతనం ఇస్తున్నారు. ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు ప్రోత్సాహక రుసుం రూ.3వేలు చెల్లిస్తున్నారు. ఎంపీఈఓల పనితీరు బాగుందని వ్యవసాయ అధికారి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తేనే రూ.3వేలు ప్రోత్సాహక రుసుం అందిస్తారు. లేదంటే ఆ సొమ్ము కూడా రాదు. రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమానంగా పనులు చేస్తున్నా వేతనం మాత్రం తక్కువగా ఇస్తున్నారని ఎంపీఈఓలు వాపోతున్నారు. సమాన వేతనం ఇవ్వాలంటూ ఆ సంఘం నాయకులు.. ఉన్నతాధికారులు, ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 2023లో అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్.. ఎంపీఈఓలు రైతు భరోసా కేంద్రం సిబ్బంది తరహాలోనే అన్ని రకాల పనులు చేస్తున్నారనీ, వారికి మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వొచ్చని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం. గత వైసీపీ పాలనలో అవి అమలుకు నోచుకోలేదని తెలిసింది. కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్న ఆశతో ఎంపీఈఓలు ఎదురు చూస్తున్నారు. తాజాగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎంపీఈఓల సంఘం నాయకులు.. మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని విన్నవించారు. రెండేళ్ల క్రితం అప్పటి కమిషనర్.. ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ ఇవ్వాలంటూ ప్రతిపాదించిన విషయాన్ని, ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి పయ్యావుల హామీ ఇచ్చారు. అలాగే అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఎంపీఈఓలు కలిసి ఇదే అంశంపై వినతి పత్రం అందజేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తమకు కూటమి ప్రభుత్వంలో తప్పనిసరిగా న్యాయం చేకూరుతుందన్న ఆశాభావాన్ని బాధిత ఎంపీఈఓలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

మినిమమ్ టైం స్కేల్ వర్తింజేయాలి



రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. వారికి నెలకు అన్నిరకాల అలవెన్సులు కలిపి రూ.34వేల వేతనం ఇస్తున్నారు. పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు రూ.3వేలు ప్రోత్సాహక రుసుం చెల్లిస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసి, సమాన పనికి సమాన వేతనం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

- రెడ్డిప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చులకన భావం వీడాలి



కొందరు అధికారులు.. ఎంపీఈఓలను చులకన భావంతో చూస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులే కదా..? అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. ఎంపీఈఓలపై వేధింపులు ఆపాలి. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వం ఆదుకోవాలి.

-తిరుపతయ్య, ఎంపీఈఓల సంఘం జిల్లా కార్యదర్శి

చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ భారం



పదేళ్లుగా వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. చాలీచాలని జీతంలో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. గత ప్రభుత్వంలో ఐదు నెలలకోమారు జీతాలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి నెలా వేతనం అందేలా చర్యలు తీసుకోవాలి. రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి.

-భాగ్యలక్ష్మి, ఎంపీఈఓల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు

19 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం విద్య/కొత్తచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ-2025) పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులకు సంబంధించిన లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి అభ్యర్థుల హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయనీ, డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

'హెల్మెట్ తప్పక ధరించాలి'

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. స్థానిక డీటీసీ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలపై వాహనదారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ... రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీసీ వీర్రాజు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు సునీత, ఏఎంవీఐలు రఘునాథ్, ప్రసాద్ పాల్గొన్నారు.

సునామ జకినీమాత ఉత్సవాలు ప్రారంభం

గుత్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లో రోడ్డులో వెలసిన అరెకటికల అరాధ్య దైవం శ్రీ సునామ జకినీమాత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున జకినీ అమ్మవారితోపాటు మల్కామ మాతకు అభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహామంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం సునామ జకినీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో కొలువుదీర్చి, స్థానిక సాయిబాబా మందిరం నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగించారు. మహిళలు కలశాలతో ముందు కదిలారు. మంగళవాయిద్యాలు, నృత్యాలతో సందడిగా సాగింది. రాత్రి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ధర్మకర్త సురేష్‌రావు, కార్య నిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు సాయిబాబా, రామచంద్రరావు, బాబురావు, అభిలాష్, వెంకట్‌రావు, ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.


కలశాలతో మహిళల ఊరేగింపు

అనారోగ్యంతో తాపీ మేస్త్రీ ఆత్మహత్య


సాకే రంగప్ప (ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన తాపీ మేస్త్రీ సాకే రంగప్ప(63) అనారోగ్యంతో మనస్తాపం చెంది బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం మైలేపల్లి చెరువు కట్ట సమీపాన రంగప్ప.. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడడాన్ని గమనించిన లోకో పైలెట్ రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించాడు. రాత్రి 9గంటల సమయంలో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్దనున్న ఆధార్, సెల్‌ఫోన్‌తో వివరాలు సేకరించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనారోగ్యంతో విసుగుచెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. రంగప్పకు భార్య గంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు, కుమార్తెకు వివాహాలు అయ్యాయి.

న్యూస్ బాక్స్

సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గురువారం మండలం నాయకులతో నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆమె సమావేశం అయ్యారు. గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి ప్రస్తావించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయన్నది ఆరా తీశారు. ప్రధానంగా ఇంటి పట్టాల విషయంపై చర్చించారు. గతంలో మండలం పరిధిలో కొన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. వాటిలో ఒక్కటి కూడా పూర్తి కాలేదన్నారు. ఈ విషయంపై హౌసింగ్, రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. ఇప్పటికే అలాంటి వాటి జాబితా సిద్ధం చేశామని, దీనిపై ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. గ్రామాల్లో ఇళ్లు లేని వారి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని చెప్పారు.

కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



కందులతో ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రాప్తాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కందులతో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు ఎక్కువ మంది కంది సాగు చేశారని, కోతలు పూర్తి చేసి అమ్మకానికి సిద్ధంగా ఉంచుకున్నారన్నారు. ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కందులు కొనుగోలు చేయాలన్నారు. శుక్రవారం నుంచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ విజయకుమారి తెలపడంతో నాయకులు ధర్నా విరమించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, పోతులయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమిని కేటాయించండి



మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అనంత జిల్లాలో పద్మశాలి కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం 5 ఎకరాలను కేటాయించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను రాష్ట్ర చైర్మన్ అబద్దయ్య కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో పద్మాశాలి కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీనరసింహులు, పురుషోత్తంలతో కలిసి మంత్రికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

అలరించిన అరంగేట్రం



నృత్యప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గురుకృప సంగీత నృత్య కళానిలయం ఆధ్వర్యంలో అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయంలో నిర్వహించిన అరంగేంట్ర నృత్య ప్రదర్శన వీక్షకులను అలరించింది. నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్య బృందం శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో అలరించారు. అనంతరం చిన్నారులను జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

రామగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో వెలసిన హనుమభీమామధ్వాంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం మధ్వనవమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. ప్రతి ఏడాది మధ్వనవమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రామకృష్ణస్వామి తెలిపారు.

అన్నదాతలకు అండగా ఉంటాం: టీడీపీ

రాప్తాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతులకు అండగా ఉంటామని టీడీపీ రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి అన్నారు. బుధవారం రాప్తాడులో ప్రమాదవశాత్తు రైతు దండు శివయ్యకు చెందిన పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మురళి గురువారం రైతు శివయ్య దొడ్లో కాలిపోయిన పశుగ్రాసాన్ని టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతు కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. అలాగే సాకే జయరాముడు రూ. 5 వేలు అందించారు. కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ సాకే తిరుపాలు, హంపాపురం జయప్ప, గోనిపట్ల శీనా, బీరన్న, శివ, నరేంద్ర పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న ధర్మవరపు మురళి



జనవరి28న ఎంబీఏ విభాగం ఎదుట విరిగిపడిన చెట్టు



ఫిబ్రవరి 6న కూడా అలాగే వదిలేసిన దృశ్యం

పట్టించుకోరా..?

● పది రోజుల క్రితం విరిగిన చెట్టు
● తొలగించని జేఎన్‌టీయూ అధికారులు
● ఇబ్బంది పడుతున్న ఎంబీఏ విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తరగతులకు వెళ్లేందుకు విద్యార్థులు వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. గతనెల 28న జేఎన్టీయూ ఎంబీఏ విభాగం ముందున్న చెట్టు కూకటి వేర్లతో విరిగి పడింది. భవనానికి వెళ్లేందుకు అడ్డంగా పడినా తొలగించడం లేదు. సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వారం రోజులనుంచి అలాగే ఉండిపోయిందని విద్యార్థులు మండిపడుతున్నారు. దారికి అడ్డంగా లేకుండా తామే తొలగిస్తామన్నా ససేమిరా అంటున్నారు. తొలగించాల్సిన వారేమో పట్టించుకోవడంలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బంది తప్పడంలేదని విద్యార్థులు వాపోతున్నారు.

ఎలా పనిచేయిస్తారు..?

మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు వర్సిటీల ప్రత్యేక ఇంజనీరింగ్ విభాగముంది. సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎస్ఈ), డిప్యూటీ ఇంజనీర్(డీఈ), అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ), టెక్నికల్ ఇంజనీర్(టీఈ)లతోపాటు క్షేత్రస్థాయి సిబ్బందితో ఈ విభాగం పనిచేస్తోంది. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడే పనిచేస్తున్నా విధుల్లో మాత్రం తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఏదేని చిన్న పని చేయడానికి కూడా బద్దకంగా వ్యవహరిస్తారు. లేటర్లు రాసినా, ఆదేశాలు జారీచేసినా వారికెక్కదు. ఆదాయం వచ్చే పనులకైతే ముందుగానే ప్రత్యక్షమవుతారు. అలాంటి ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, అధికారులతో ఎలాపనిచేయిస్తారని ఉన్నతాధికారులను విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. విరిగి పడిన చెట్టును తొలగించాలని ఉత్తరం రాసి వారం రోజులైనా స్పందించకపోవడం ఇందుకు నిదర్శనమని మండిపడుతున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్‌లో గురువారం నిర్వహించిన అనంత మిత్ర పంచాయతీరాజ్ శాఖ సమస్యలపై ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ కార్యక్రమం ఉదయం 7.45 నుండి 8.15 వరకు కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత శాఖ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు ఆయన సమాధానం ఇచ్చారు. బుక్కరాయసముద్రం ఎస్సీ కాలనీ నుంచి గురుమూర్తి మాట్లాడుతూ.. ప్రధాన రోడ్డు నుంచి కాలనీకి రహదారి లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. స్పందించిన కలెక్టర్ రోడ్డుకు సంబంధించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి ఏ నిధుల నుంచి ఏర్పాటు చేయాలో నిర్ణయించుకొని తగిన చర్యలు చేపడతామన్నారు.

● రామగిరి మండలం నుంచి వరలక్ష్మి సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో సమస్యలను పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. మా అమ్మమ్మను అనారోగ్యంతో అక్కడ చేర్పించామని, కనీసం వీల్‌చైర్ సదుపాయం కూడా లేదన్నారు. వీల్‌చైర్ కావాలంటే రూ.200 నుంచి రూ.300 ఇవ్వాల్సి వస్తోందన్నారు. యూరిన్ పైప్ వేయాలంటే రూ.500 అడుగుతున్నారన్నారు. బెడ్‌పై దుప్పట్లు మార్చడం లేదన్నారు. స్పందించిన కలెక్టర్ మీరు చెప్పిన దానికి అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరుపై పరిశీలించి వారిపై తగిన చర్యలు చేపడతామన్నారు. జిల్లా నుంచి 13 మందితో మాట్లాడినట్లు కలెక్టర్ తెలిపారు. పంచాయతీ అధికారి నాగరాజనాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రామగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే పరిటాలసునీత చేతులమీదుగా ఉదయం 11 గంటలకు రామగిరిలోని వ్యవసాయ శాఖకార్యాలయ ఆవరణలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మారుతీప్రసాద్, శ్రీధర్ నాయుడు తెలిపారు.

రాప్తాడు: మండలంలోని మరూరు టోల్ గేటు వద్దనున్న గిడ్డంగిలో శుక్రవారం కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కందులు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మండలాధ్యక్షుడి ఎంపిక

రామగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండల అధ్యక్షుడి ఎంపిక శుక్రవారం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీగా ఉన్న మీనిగ నాగమ్మ అనారోగ్య కారణంతో డిసెంబరు ఆఖరున మృతిచెందింది. ఆమె మృతితో సీఈఓ ఆదేశాల మేరకు మండల ఉపాధ్యక్షుడిగా ఉన్న కద్రెన్నను అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయన్నారు. శుక్రవారం ఉదయం 11-30గంటలకు అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుడు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పంచాయతీకార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పేదలకు 3 సెంట్ల స్థలం ఇవ్వాలి

శింగనమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామాల్లో ఇంటిస్థలాల కోసం మూడు సెంట్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నాగులగుడ్డంతండాలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అనువుగాని చోట్ల గ్రామాల్లో రెండు సెంట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. కూటమి ప్రభుత్వమైన మూడు సెంట్లు ఇచ్చిన పేదలను ఆదుకోవాలన్నారు. చిన్నప్ప యాదవ్,టి.నారాయణస్వామి, శ్రీనివాసులు, మునిస్వామి, రూప్లానాయక్ పాల్గొన్నారు.

చౌక డిపోలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో చౌక డిపోలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. అందులో భాగంగా గురువారం సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గుత్తి మండలంలోని గుత్తి ఆర్ఎస్‌లో ఉమామహేశ్వరికి చెందిన చౌక డిపోలో తనిఖీలు చేశారు. అక్కడ ఉన్న భౌతిక నిలువలను, రికార్డులను పరిశీలించారు. ఉండాల్సిన వాటికంటే వ్యత్యాలు ఉన్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. భౌతిక నిలువలను జప్తు చేసుకొని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఏఓ వాసుప్రకాష్, సీఎస్‌డీటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నగరంలో అహుడా చైర్మన్ పర్యటన

● మహిళల టాయిలెట్ల ఏర్పాటుకు సన్నాహాలు



అధికారులతో ఆరా తీస్తున్న అహుడా చైర్మన్

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అహుడా చైర్మన్ టీటీసీ వరుణ్ అనంతపురం నగరంలో గురువారం పర్యటించారు. అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో కలియ తిరిగారు. అహుడా ఆధ్వర్యంలో నగరంలో మహిళలకు మెట్రో నగరాల తరహాలో అత్యాధునిక టాయ్‌లెట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను చూశారు. ప్రస్తుతం పాతూరు పరిధిలో ఒకటి, న్యూటౌన్ పరిధిలో మరొకటి ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. మహిళలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇలా వారి సమస్యలు తీర్చినట్టవుతుందని చైర్మన్ అన్నారు. అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్, సెక్రటరీ గౌరీశంకర్, ఈఈ దుష్యంత్, సర్వేయర్ శరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో తాగునీటి సమస్య రానివ్వకండి: మేయర్

అనంతపురం క్రైం,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నగరంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలని నగర మేయర్ మహమ్మద్ వసీం నగరపాలక అధికారులను ఆదేశించారు. గురువారం మేయర్ తన చాంబర్‌లో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్యలతో కలిసి అధికారులతో సమీక్షించారు. లీకేజీలు లేకుండా పైప్‌లైన్‌లను పరిశీలించాలని సూచించారు. మోటార్లు కాలిపోయినా ఇబ్బంది లేకుండా స్టాండ్ బై మోటార్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఈఈలు రాధాకృష్ణ, షాకీర్, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, డీఈలు నరసింహులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

డీఎల్‌పీఓగా విజయ్‌కుమార్ రెడ్డి

అనంతపురంన్యూటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం డీఎల్‌పీఓగా విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్, డీపీఓ నాగరాజనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. పుట్టపర్తి పెనుకొండ డీఎల్‌పీఓగా పనిచేస్తూ పుట్టపర్తి ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేశారు. కొన్నినెలల క్రితం వ్యక్తిగత పనుల నేపథ్యంలో సెలవుపై వెళ్లారు. ఈక్రమంలోనే అనంతపురం డీఎల్‌పీఓగా నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో డీఎల్‌పీఓగా పనిచేస్తున్న సుమన జయంతి బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు.

మీ సొత్తు జాగ్రత్త

● కల్యాణమండపాల్లో ఫోర్త్‌టౌన్ పోలీసులు

అనంతపురం క్రైం.ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పెళ్లిలో ఉన్నారు..మీ ఇళ్లలో... బ్యాగుల్లో మీ బంగారు ఆభరణాలు, డబ్బు జాగ్రత్త అని నాలుగో పట్టణ పోలీసులు సూచించారు. గురువారం సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పలు కల్యాణమండపాలు, ఫంక్షన్‌హాళ్లకు వెళ్లారు. దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి వివరించారు. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచాలని నిర్వాహకులకు, ఫంక్షన్ హాల్ యజమాన్యానికి సూచించారు. సీసీ టీవీలను ఎప్పకటిప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. అనుమానం వస్తే తక్షణమే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నేడు జాబ్‌మేళా

నార్పల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్ డేవిడ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీవీ ప్రతాపరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐఫెల్‌ఫైనాన్స్, యంగ్ ఇండియా తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన ప్రతి ఒక్కరూ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9010039901 నంబరును సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు ఛిద్రం: డీటీసీ



మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని డీటీసీ వీర్రాజు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీటీసీ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. ఏఏ కారణాలతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో విద్యార్థులకు వివరించారు. అనంతపురం ఆర్టీఓ సురేష్‌నాయుడు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. క్షతగ్రాతులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి, ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేయాలన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. కళ్యాణదుర్గం ఆర్టీఓ రమేష్, ఎంవీఐ మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శశాంక్ మౌళి, అధ్యాపకులు విష్ణుప్రియ, సుధాకర్, రామకృష్ణ, సోమశేఖర్, శ్రీనివాస్, ఎస్ఐ విజయభాస్కర్, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను మూడోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాలోని అంగన్‌వాడీలు రాష్ట్రపతికి కొరియర్ ద్వారా పంపుతున్న వ్యక్తిగత అర్జీలను సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు తమ సమస్యలపై రాసిన వ్యక్తిగత అర్జీలను 13వ తేదీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతికి సమర్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ఆనందదాయకమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పాలకులు వేతనాలు పెంచాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేస్తూ జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కరించని పక్షంలో 17 నుంచి దశలవారీగా పోరాటాలు చేపడతామన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు శకుంతల, రమాదేవి, కోశాధికారి కాత్యాయని, నక్షత్ర, రేవతి, షాహీనా పాల్గొన్నారు.



వ్యక్తిగత అర్జీలను విడుదల చేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లు

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం.. వరం

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



ఉర్దూ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం అమలు విద్యార్థులకు వరమని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. స్థానిక కొత్తూరు జూనియర్ కళాశాల, అదే ప్రాంగణంలోని హైస్కూల్, ఉర్దూ స్కూల్, ఒకేషనల్ స్కూల్స్‌లో ఎమ్మెల్యే గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న విద్యపై ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనం, కోడిగుడ్లను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించడంతోపాటు ఉర్దూ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థుల అభిప్రాయాలను తీసుకున్నారు. గతంలో ఆకలితో ఉండేవారమని, సాయంత్రం ఇంటికి వెళ్లేదాకా తినేవారం కాదని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజినేయులు, నాయకులు గంగారామ్, ముక్తియార్, సైఫుద్దీన్, స్వామిదాస్, నెట్టెం బాలకృష్ణ, గోళ్ల సుధాకర్ నాయుడు, ఇస్మాయిల్, రాంబాబు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జేసీ శివనారాయణ్ శర్మ

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట అంధమహిళా ఆశ్రమంలో సుజలాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గురువారం వాటర్ ప్లాంట్‌ను జేసీ శివనారాయణ్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మంచినీటి అవసరం ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. ఆశ్రమం వారు వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫౌండేషన్ సభ్యులు సూర్యమోహన్, మేనేజర్ రామక్రిష్ణ, ఆశ్రమ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, జాస్మిన్ పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్ పరిశీలన: మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలో ఎంఐజీ లేవుట్‌ను జేసీ శివనారాయణ్ శర్మ గురువారం పరిశీలించారు. లేఅవుట్‌లో మౌలిక వసతులు, టెండర్ ప్రక్రియ ఎస్టిమేషన్ వివరాలను ఆరా తీశారు. ఈ మేరకు పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అహుడా ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశాంచారు.

ఎస్సీ, ఎస్టీ రైతులను భాగస్వాములను చేయాలి



హార్టికల్చర్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రైతుల కోసం తలపెట్టిన హార్టికల్చర్‌హబ్‌లో ఎస్సీ, ఎస్టీ రైతులను భాగస్వాములను చేయాలని ఆయా సంఘాల నాయకులు కోరారు. గురువారం హార్టికల్చర్, డ్వామా అధికారులను వేర్వేరుగా కలిసిన ఎస్సీ ఎస్టీ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు జిల్లాలో జాతీయ స్థాయి హార్టికల్చర్ కాన్‌క్లేవ్ నిర్వహించడం పట్ల సీఎం, మంత్రులు, కలెక్టర్, అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ ఎస్టీ పండ్లతోటల రైతులపై దృష్టి సారించాలని కోరారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరమెట్ల యల్లన్న, ఎంఎస్ఎఫ్ నగేష్, చిరంజీవి, వీరాంజి, తిరుమలయ్య, ఓబులేసు, వీరా రామాంజనేయులు, కడదరకుంట రామాంజనేయులు పాల్గొన్నారు.

కంది రైతులకు రూ.2 వేలు బోనస్ ఇవ్వాలి



కంది కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఓబులు, సీపీఎం నాయకులు

శింగనమల ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసే కంది పంట క్వింటాల్‌కు రూ.2 వేలు బోనస్ ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో గురువారం మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుతో కలిసి ఓబులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కందుల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సడలించిన నిబంధనల మేరకు ప్రభుత్వమే ఎకరాకు రెండు క్వింటాళ్లు కాకుండా 4 నుంచి 5 క్వింటాళ్ల వరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం క్వింటా రూ.7,550 చొప్పున కొనుగోలు చేస్తున్నారని దీనికి తోడు మరో 2 వేలు బోనస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, శ్రీనివాసులు, లక్ష్మీపతి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణ భూమిలోకి నీరు..!

● రెవెన్యూ యంత్రాంగం ఇప్పటికైనా స్పందించేనా?



గుడిసెల్లోకి చేరిన చెరువు ఊట నీరు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): పాములాయి చెరువు ఆక్రమణ భూమిలోకి ఊటనీరు చేరాయి. మండలంలోని సోమలదొడ్డి గ్రామ సర్వే నంబరు160 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులోని ఎకరానికిపైగా చెరువుకు ఆనుకుని ఉన్న భూమిలో బుడగ జంగమ కులానికి చెందినవారు ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారు. ఈ భూమి చెరువుకు ఆనుకుని ఉండటంతో గుడిసెల్లోకి నీరు చేరాయి. మూడు నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతిలో ఎవరిది బాధ్యత అన్న శ్రీర్షికన కథనం ప్రచురితమైంది. రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి గుడిసెలు తొలగించాలని సూచించారు. మళ్లీ అటువైపు చూడలేదు. అంతటితో సదరు అధికారులు సరిపెట్టారు. ప్రస్తుతం గుడిసెల్లోకి నీరు చేరాయి. పోను..పోను నీటి ఊట మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. స్థానికంగా జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ఎవ్వరు బాధ్యత వహిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

సంక్షిప్త వార్తలు

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. తొలిరోజు జక్కలచెరువులోని స్వామివారి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉత్సవవిగ్రహాన్ని పెళ్లి కుమారుడిగా అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం జక్కలచెరువు నుంచి తొండపాడులోని ఆలయానికి తీసుకొచ్చి రాత్రి 10 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పనతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. స్వామి వారికి శుక్రవారం సింహవాహోత్సవం నిర్వహిస్తామని ఈఓ రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు రవిస్వామి, లిఖిల్ వర్మ, రాఘవేంద్రచార్యులు, చేతన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో హుండీ కానుకల్ని లెక్కించారు. గత 7 నెలల నుంచి భక్తులు హుండీలో వేసిన కానుకల్ని లెక్కించారు. ఇందులో రూ.7,95,367 లక్షల ఆదాయం చేకూరినట్లు ఈఓ తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

గుత్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ చౌకదుకాణంలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఆర్ఎస్‌లోని 19వచౌకధాన్యడిపోను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అందులో స్టాక్‌లో, నిత్యావసరసరుకుల్లో చట్టప్రకారం ఉండాల్సిన వాటికన్నా ఎక్కువ వ్యత్యాసాలున్నట్లు గుర్తించామని విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు డీలర్‌పై కేసు నమోదు చేసి, స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారి వాసుప్రకాష్, సీఎస్‌డీటీ సూర్యనారాయణ, వీఆర్వో కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన..

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్‌లో గురువారం నిర్వహించిన అనంత మిత్ర పంచాయతీరాజ్ శాఖ సమస్యలపై ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమంలో ఉదయం 7.45 నుంచి 8.15 గంటల వరకు కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత శాఖ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులకు ఆయన సమాధానం ఇచ్చారు. అందులో యల్లనూరు మండలానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి గోకులం పథకం ద్వారా రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకున్నామని, అయితే బిల్లులు చేయడానికి సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ అలసత్వం వహించిన సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఉరవకొండ మండలానికి చెందిన కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. తాగునీటి సమస్యతో చాలా ఇబ్బందికరంగా ఉందని, సత్యసాయి నీరు రెండు వారాలకు ఒక సారి వస్తున్నాయని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సత్యసాయి నీటి సరఫరాలో ఏదైన సమస్య ఉంటే పరిష్కరించి నీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

పుట్లూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల రైతులకు ఎలాంటి మేలు లేదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు విమర్శించారు. బడ్జెట్‌ను నిరసిస్తూ మండలకేంద్రంలో గురువారం సంఘం నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ బడ్జెట్ వలసలు, నిరుద్యోగం పెంచేలా ఉందన్నారు. రైతులను మోదీ ప్రభుత్వం మభ్యపెడుతోందని మండిపడ్డారు. నాయకులు సత్తార్ గోపాల్, గోపాలక్రిష్ణ, చిన్ని కృష్ణుడు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం సందర్శన

గుత్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేంద్రీయ విద్యాలయాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ వీఎంసీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాఠశాలలో వసతులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించే విధంగా స్ఫూర్తిని నింపాలన్నారు. అదే విధంగా విద్యాలయంలో ఎన్‌సీసీని ప్రవేశ పెట్టేలా చూడాలని సూచించారు. పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూరాధప్రభుదాస్, ప్రిన్సిపాల్ మాలిక్‌సాహెబ్, తహసీల్దారు ఓబులేసు, వీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుబడిన రేషన్ బియ్యాన్ని వదిలేశారా?

ఉరవకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలుతున్న రేషన్‌బియ్యాన్ని పట్టణంలో పోలీసులు గురువారం పట్టుకున్నారు. అయితే ఏమైందో ఏమో మళ్లీ వెంటనే ఆ బియ్యాన్ని వదిలిపెట్టారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. పట్టుకున్న బియ్యాన్ని పోలీసులు ఆటోతో పాటు వదిలేశారన్న చర్చ జోరుగా సాగుతోంది. ఓ హెడ్‌కానిస్టేబుల్ ద్వారా విషయం బయటకు పొక్కింది. గత కొన్నిరోజులుగా ఉరవకొండ కేంద్రంగా రేషన్‌బియ్యం అక్రమదందా కొనసాగుతోంది. వీటిని అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారన్న చర్చ సాగుతోంది. రేషన్‌బియ్యాన్ని వదలడంలో ఓ పోలీస్ అధికారితోపాటు, కానిస్టేబుల్ కీలకపాత్ర వహించినట్లు చర్చ నడుస్తోంది.

వైద్యానికి ఎమ్మెల్యే సిఫారసు

శెట్టూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని కనుకూరు గ్రామానికి చెందిన గురుమూర్తి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కలిసేందుకు కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రజావేదిక వద్దకు గురువారం వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎదురేగి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వెనువెంటనే అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి అక్కడికి చికిత్స కోసం పంపించారు. ఆస్పత్రికి వెళ్లేందుకు అవసరమైన వాహన ఖర్చులు ఎమ్మెల్యే సమకూర్చారు. ఇందుకు గురుమూర్తి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



బాధితుడి వద్దకు వెళ్లి పలకరిస్తున్న ఎమ్మెల్యే



పశువుల ఆస్పత్రి



పశువుల ఆస్పత్రి భవనంలో దెబ్బతిన్న బండల పరుపు



మొండిగోడలకు పరిమితమైన ఇండోర్ స్టేడియం

ప్రారంభించకనే..శిథిలావస్థకు..

- ఆగిపోయిన భవన నిర్మాణాలు
- నెర్రెలు చీలుతున్న గోడలు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధ ప్రభుత్వ భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. నిర్మాణాలు పూర్తికాకనే గోడలు నెర్రెలు చీలి, బండ పరుపు దెబ్బతింటున్నాయి. పట్టణంలోని శ్రీనివాసపురంలో పశువుల ఆస్పత్రితోపాటు ల్యాబ్ నిర్మాణానికి దాదాపు రూ.80లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులు మొత్తం ఖర్చు చేసి, నిర్మాణం దాదాపు పూర్తి చేశారు. మిగిలిన వాటిని పూర్తి చేయడానికి ఇంకా రూ.20లక్షల మేర నిధులు అవసరం. గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణ మొండిగోడలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వమైనా వాటి నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. చిన్నబజారులోని పాత కూరగాయల మార్కెట్ సమీపంలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. ఆ స్థలంలో పిచ్చిమొక్కలు, కంప చెట్లు ఏపుగా పెరిగాయి. పాతకోటలో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిధుల లేమితో మధ్యలోనే ఆగిపోయింది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిపై పాలకులు దృష్టిపెడితే బాగుంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రజాధనం వృథా

ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో గత టీడీపీ ప్రభుత్వం భవన నిర్మాణాలు చేపట్టింది. అందుకు రూ.5కోట్లు విడుదల చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ ప్రభుత్వం తలపెట్టిన నిర్మాణాలపై శీతకన్ను వేసింది. నిధులు తక్కువగా ఉన్న వాటికి అదనంగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. కూటమి ప్రభుత్వమైనా భవన నిర్మాణాలు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు



వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న వేదపండితులు

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు రెండో రోజు గురువారం వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి పూజా కార్యక్రమాలు వేదపండితులు ప్రారంభించారు. వేదపారాయణం, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, గణపతి, నవగ్రహ, మృత్యుంజయ, ఆయుష్య హోమం, మహాస్నపనం, జలాధివాసం, క్షీరాధివాసంతో పాటు విగ్రహాలను గ్రామ ప్రదక్షిణ చేయించి పూజలు జరిపించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొనానరు. శుక్రవారం తెల్లవారుజామున వాసవీమాత, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగేశ్వర విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు ముద్దు మల్లికార్జునశెట్టి, ఆర్వేటి లేపాక్షిశెట్టి తెలిపారు.

పనులు చేసినా.. బిల్లులు ఎందుకివ్వరు?

మండల సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

విడపనకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యలు రాకుండా పనులు చేయించాము ఐదు నెలలు గడిచినా బిల్లులు ఎందుకు చేయడం లేదంటూ కరకముక్కల సర్పంచ్ రామాంజనేయులు, కొట్టాలపల్లి సర్పంచ్ మోదుపల్లి రామాంజనేయులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ కరుణం పుష్పావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అధికారులు మాట్లాడుతూ ఏ గ్రామంలోనూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రజాప్రతినిధులు చూడాలన్నారు. వాటికి కావాల్సిన నిధులను ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. దీంతో కరకముక్కల సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి ఎద్దడి తీర్చేందుకు ఐదు నెలలు క్రితం బోర్లు వేయించామని, కానీ ఇప్పటి వరకూ బిల్లు మంజూరు చేయలేదని వాపోయారు. నిధులున్నా బిల్లు చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కొట్టాలపల్లి సర్పంచ్ మాట్లాతూ తాము అప్పులు చేసి పనులు చేస్తే అధికారులు బిల్లులు నిలిపివేయటం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తర్వాత పలు సమస్యలను మిగతా సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జడ్పీటీసీ హనుమంతు, వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత, ఎంపీడీఓ షకీలా బేగం, తహసీల్దార్ చంద్రశేఖరయ్య, ఈఓఆర్డీ సత్యఏసుబాబు, ఏఓ భాస్కర్, విద్యుత్ ఏఈ సత్యం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

డీ.హీరేహాళ్/బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లకు సంబంధించి సబ్సిడీ రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు డీ హీరేహాళ్ ఎంపీడీఓ దాసనాయక్, ఏఓ బలరాంబు, బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయభాస్కర్, రాయదుర్గం ఎంపీడీఓ కొండన్న గురువారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన ముగియనున్న గడువును ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. కొన్ని కార్పొరేషన్లకు సంబంధించి దరఖాస్తులు తక్కువగా రావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి: ఎమ్మెల్యే జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. పట్టణంలోని రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ఆసుపత్రిలో ఆ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. తొలుత కమిటీ సభ్యులుగా పీ.రామ్మూర్తి, వీ.పవన్ కుమార్, రాయల్ వెంకటేశులు, ఎం. యుగంధర్, కేఎస్. జీవిత, ఇందిరదేవితో ఆస్పత్రి ఇన్చార్జి సూపరింటెండెంటు జయవర్ధన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేవిధంగా కృషిచేయాలని తెలిపారు. కమిటీ సమావేశంలో చర్చించిన 19 అంశాల విషయంగా చిత్తశుద్ధితో పనిచేయాలని చెప్పారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పూల రమణ, కొలిమి రామాంజనేయులు పాల్గొన్నారు.


తూకాల్లో మోసం..

- వ్యాపారిని నిలదీసిన రైతులు

ఉరవకొండ, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పంటల కొనుగోలు సమయంలో వ్యాపారులు రైతులను మోసం చేస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఎర్రిస్వామి, రామాంజినేయులు అనే వ్యాపారులు గురువారం రైతులు మోహన్, రమీంద్రల నుంచి శనగలు కొనుగోలు చేశారు. కొనుగోలు సమయంలో తూకాల్లో వ్యాపారులు చేస్తున్న మోసాన్ని రైతులు గుర్తించారు. సంచితో పాటు 52కేజీలు పట్టాల్సి ఉండగా 56కేజీలు తూకాలు వేయడాన్ని గమనించారు. 70క్వింటాళ్ల దాకా వారి వద్ద నుంచి కొనుగోలు చేశారు. దీంతో వ్యాపారులను నిలదీస్తే ఎక్కువగా పట్టినట్లు ఒప్పుకున్నారు. లారీలో ఎత్తిన సరుకు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. చేసేదిలేక వ్యాపారులు డబ్బుకట్టి సరుకును తీసుకెళ్లారు.

పరీక్షల సమయంలో సమయాన్ని వృథా చేయరాదు

విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీసీ బాలికల కళాశాల హాస్టల్లో కళ్యాణదుర్గం డివిజన్‌కు సంబంధించి పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూఠారి హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు ఇంకా నెలరోజుల సమయం వుందని, అందువలన సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణుల వ్వాలని కోరారు. ఆ తరువాత డీడీ సొంత ఖర్చులతో విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందించారు. తర్వాత ఎస్ఆర్ శంకర్ వనరుల కేంద్రాన్ని డీడీ ప్రారంభించారు. క్రియేటర్ కృష్ణ, కళ్యాణదుర్గం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాద్రి, బీసీ హాస్టళ్ల వార్డెన్లు రాజశేఖర్ నాయుడు, పద్మావతి, అరుణ, ఓబుళమ్మ, నాగరాజు, సత్యనారాయణ, ఆదినారాయణ, సతీష్, అశ్వర్థ, టీచర్లు పాల్గొన్నారు.

మట్కారాయుళ్ల అరెస్టు

తాడిపత్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్ కాలనీలో మట్కాస్థావరాలపై గురువారం పట్టణ సీఐ సాయిప్రసాద్, ఎస్ఐ గౌస్ బాషా సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో తొమ్మిది మంది మట్కారాయుళ్లను అరెస్టు చేసి రూ.1,75,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అందరినీ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

గుత్తిరూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఊటకల్లు గ్రామశివారులో గురువారం పొలం వద్ద జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. బేతాపల్లికి చెందిన రామాంజనేయులు, సూరి పొలంలో గట్టు వద్ద ఊటకల్లుకు చెందిన సుబ్బరాయుడు, ఆయన కుమారుడు శివతో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇందులో వారు పరస్పరం రాళ్లతో దాడిచేసుకున్నారు. రామాంజనేయులు, సూరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



జయమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విట్లంపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త జయమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ సెక్టార్ లీడర్లు తిప్పేరమ్మ, వన్నూరప్ప, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. గత సమ్మె కాలంలో జరిగిన ఒప్పందం ప్రకారం విధుల్లో మృతి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు మట్టి ఖర్చులకు రూ. 15 వేలు సూపర్‌వైజర్ ఓబుళమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

హెడ్‌క్వార్టర్స్‌ను తరలించరాదు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో ఉన్న రైల్వే జోనల్ హెడ్ క్వార్టర్స్‌ను తరలించకుండా యథాస్థానంలో ఉంచాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో గురువారం వారు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సికింద్రాబాద్‌లోని రైల్వే జోనల్ హెడ్‌క్వార్టర్స్‌ను విశాఖకు తరలించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. విశాఖకు మార్చితే రైల్వే ఉద్యోగులు సమస్యలపైన వెళ్లి రావాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. రైల్వే ఉద్యోగుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని జోనల్ హెడ్ క్వార్టర్స్‌ను విశాఖకు మార్చకుండా సికింద్రబాద్‌లోనే ఉంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, సభ్యులు జగ్గలిరమేష్, సాకేనాగరాజు, సురేంద్రబాబు, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లెలి మృతితో అన్న ఆవేదన

- ఆస్పత్రి అద్దాలు ధ్వంసం

గుత్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండంలోని బసినేపల్లికి చెందిన రమీజా (23) అనే మహిళ బుధవారం రాత్రి అనారోగ్యంతో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందింది. దీంతో ఆవేదనకు గురైన ఆమె సోదరుడు అజ్జు ఆస్పత్రిలోని తలుపుల అద్దాలను పగులగొట్టాడు. రమీజా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. బుధవారం రాత్రి పరిస్థితి క్షీణించడంతో కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. చెల్లెలు మృతి విషయం తెలియడంతో అజ్జు బాధను తట్టుకోలేక ఆసుపత్రి ద్వారానికి ఉన్న అద్దాలను పగలగొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి వెంటనే ఆస్పత్రి సిబ్బంది వైద్యచికిత్సలు అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లెనిన్‌కు పురస్కారం

కుందుర్పి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్య, పర్యావరణం, నైతిక విలువల గురించి తన పాటల ద్వారా సమాజాన్ని చైతన్యపరుస్తున్న గాయకుడు లెనిన్ బాబుకు భారత్ గౌరవ్ పురస్కారం లభించింది. దేశంలో అత్యుత్తమ సామాజిక సేవలు అందిస్తున్న 51 మంది సంస్థలు, వ్యక్తులకు భారత వికాస సంఘం, భారతీయ సంస్కృతి ఉత్సవం నిర్వాహకులు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని కలబురిగి జిల్లా సేడంలో నిర్వహిస్తున్న భారతీయ సంస్కృతి ఉత్సవాలలో బుధవారం లెనిన్‌కు పురస్కారాన్ని అందజేశారు. ఉత్సవ నిర్వాహకులు గోవిందాచార్య, బసవరాజు పాటిల్, మాధవరెడ్డి తదితరులకు లెనిన్ కృతజ్ఞతలు తెలిపారు.



భారత గౌరవ పురస్కారం అందుకుంటున్న లెనిన్

గడ్డివామి దగ్ధం

● రైతుకు రూ.80 వేల ఆర్థిక సాయం

గుంతకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కొండకు నిప్పు అంటుకోవడంతో ఓ రైతుకు చెందిన గడ్డివామి, పైపులు, ఎడ్ల బండి టైరు కాలిపోయాయి. మండలంలోని నల్లదాసరి పల్లిలో రామకృష్ణ అనే రైతు బుధవారం తన పొలంలోని చెత్తను కుప్పగావేసి నిప్పంటించాడు. మంటలు చెలరేగి పక్కనే ఉన్న కొండకు వ్యాపించాయి. దీంతో కొండ నుంచి నిప్పు రవ్వలు సమీపంలో ఉన్న లోకనాథ్ యాదవ్ అనే రైతు పొలంలోని గడ్డి వామిపై పడ్డాయి. దీనివల్ల వేరుశనగ వామితోపాటు, పైపులు, ఎడ్లబండికి ఉన్న ఒక టైరు కాలిపోయాయి. ఈ విషయంగా టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ రైతు రామకృష్ణ బాధితుడికి రూ. 70 వేల పరిహారం ఇచ్చేలా ఒప్పించారు. ఆ డబ్బుతోపాటు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇచ్చిన మరో రూ. 10 వేల నగదును బాధిత రైతు లోకనాథ్ యాదవ్‌కు గురువారం గుంతకల్లు పట్టణంలో అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, కౌన్సిలర్లు ప్రభాకర్, తలారి మస్తానప్ప, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాత్రునాయక్ పాల్గొన్నారు..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలో గల బీటీపీ ప్రధాన రహదారిలో ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందారు. కర్ణాటకలోని మొలకాల్మూరుకు చెందిన బోయ హనుమంతు (30) గురువారం ఉదయం బైక్‌లో బీటీపీకి వచ్చాడు. సాయంత్రం తిరిగి రాయదుర్గం మీదుగా స్వగ్రామానికి బయలుదేరాడు. అలాగే జే వెంకటంపల్లికి చెందిన చాకలి వన్నూరుస్వామి, సాకమ్మ దంపతులు బైక్‌లో రాయదుర్గం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నారు. అయితే 75 వీరాపురం సమీపంలో వారి ఇరువురి బైక్‌లు ఎదురెదురుగా వేగంగా వచ్చి పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో బోయ హనుమంతు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. చాకలి వన్నూరుస్వామి, సాకమ్మ దంపతులకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఈశ్వరయ్య బోయ హనుమంతు మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ద్వారా వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరహాళ్ గ్రామంలో దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. గ్రామానికి చెందిన నరసింహులు, సరోజమ్మకు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కాగా ఇటీవల వారు కర్ణాటకలోని బొమ్మదేవరపల్లి గ్రామంలో జరిగిన దేవరకు వెళ్లి గురువారం సాయంత్రం స్వగ్రామానికి తిరిగొచ్చారు. ఇద్దరు గొడవ పడ్డారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన సరోజమ్మ ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆ తర్వాత భర్త నరసింహులు కూడా అలానే చేశాడు. గమనించిన స్థానికులు వెంటనే వారిద్దరినీ బళ్లారి విమ్స్‌కు తరలించారు. భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ నబీరసూల్‌ను వివరణ కోరగా.. కుటుంబ కలహాలతో దంపతులు పురుగులు మందు తాగినట్లు తెలిపారు. ఫిర్యాదు అందలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వాటర్‌మన్ మృతి

కణేకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెణిగెర వద్ద గత బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వాటర్ మన్ లక్ష్మణ్(36) మృతి చెందినట్లు ఎస్ఐ నాగమధు గురువారం తెలిపారు. కనగానపల్లి మండలానికి చెందిన లక్ష్మణ్ డీ.హీరేహాళ్ మండలం గొడిశలపల్లి సత్యసాయి తాగునీటి పథకంలో వాటర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి కణేకల్లు క్రాసింగ్ నుంచి గెణిగెర మీదుగా బైక్‌లో గొడిశలపల్లికి వెళుతుండగా మార్గమధ్యంలో ట్రాక్టర్ ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

మృతుడు లక్ష్మణ్ కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి కోరి నాగరాజు డిమాండ్ చేశారు. రాయదుర్గం ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మణ్ మృతితో అతడి కుటుంబం అనాథగా మారిందన్నారు. ప్రభుత్వం రూ. 25 లక్షలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

కూడేరు, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవకూరు గ్రామ సమీపంలో గత జనవరి 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కూడేరు నుంచి అనంతపురం వైపునకు గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళుతుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. ప్రస్తుతం అతడి మృతదేహం అనంతపురం ఆసుపత్రిలోనే ఉందని, కుటుంబ సభ్యులు ఎవరైనా గుర్తించి తమను సంప్రదించాలని పోలీసులు కోరారు.


పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఈబీ దేవి గురువారం తనిఖీ చేశారు. అక్కడ రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరు, వైద్యుల ప్రవర్తనపై ఆరా తీశారు. ముఖ్యంగా వైద్యాధికారి తీరుపై సిబ్బందితో విడివిడిగా విచారణ చేశారు. వైద్యాధికారిపై పలు ఫిర్యాదులు అందడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది జీతాలు ఎందుకు కట్ చేస్తున్నావ్, సమయపాలన ఎందుకు పాటించడం లేదు, విధులకు ఎందుకు సక్రమంగా హాజరు కావడం లేదని మండిపడ్డారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు ఓపీ చూడడం లేదని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఆస్పత్రిలో 4, 5 ప్రసవాలు జరుగుతున్నాయని, స్టాఫ్ నర్సే కాన్పులు చేస్తున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. వాటిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం జిల్లాలో ఖాళీగా ఉన్న 18 ఎఫ్ఎన్ఓ, వాచ్‌మెన్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పారు. స్థానికంగా నివాసం ఉండని ఆస్పత్రి ఉద్యోగులు స్థానికంగానే నివాసం ఉండాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి సిబ్బందితో సమావేశం

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ కొండన్న సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధిపనుల వివరాలు, పురోగతి, చేయల్సిన పనులపై సమీక్షించారు.

అడవికి నిప్పు



దగ్ధమవుతున్న బసంపల్లి సమీపంలో అడవి

శెట్టూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతానికి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి అడవిలోని చెట్లు, మొక్కలు, వన్య ప్రాణులు దగ్ధమయ్యాయి. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణం మేరకు అడవి పూర్తిగా కాలిపోయింది. వారంలోపే రెండుసార్లు అడవిలో మంటలు చెలరేగడంతో అటవీ అధికారులకు కూడా దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కొందరు ఆకతాయిలు అడవిలో బీడీలు, సిగరెట్లు కాల్చి వాటిని ఆర్పకుండా అలాగే పడేస్తుండడంతోనే ఇలా జరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు. స్థానిక ప్రజలు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నా.. గాలులు అదుపులోకి రాలేకపోతున్నాయి.